క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాయత్రిపురలో ఉన్న గాయత్రిమాత ఆలయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. గురుస్వామి గంగాధర్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచే అమ్మవారికి అభిషేకం, వస్త్రాలంకరణ, గురుపూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

లీకేజీకి మరమ్మతులు

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మంగళవారం సాయంత్రం లీకేజీ ఏర్పడింది. మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు.. అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన భగీరథ సిబ్బంది బుధవారం పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు. పనులను ఎంపీడీవో అబ్దుల్ రహీం, పంచాయతీ కార్యదర్శి యోగేశ్ పరిశీలించారు. వారి వెంట కారోబార్ కూస శంకర్, సిబ్బంది మాధవ్ ఉన్నారు.

పాఠశాలలో కళాజాత



ప్రదర్శన చేస్తున్న సుధాకర్

మామడ: మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం వ్యక్తిత్వ వికాసంపై మిమిక్రీ కళాకారుడు సుధాకర్ కళాజాత ప్రదర్శన నిర్వహించారు. మూఢనమ్మకాలను వీడి.. శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాజాత ప్రదర్శన, మాట్లాడే బొమ్మ ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దత్తసాయి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ దత్తసాయి విగ్రహ ప్రతిష్ఠాపనలో నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. బుధవారం రాత్రి 8:30 గంటలకు జరిపిన ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వీడీసీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అడ్వాల రమేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, అనిల్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరం



పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

కుంటాల: మండలంలోని లింబా(కే) గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 400 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి ప్రకాశ్ తెలిపారు. జేవీవో శౌంధర్, సిబ్బంది భరత్ భూషణ్, శ్రీధర్, నరేందర్, ఎస్‌వైకేఎస్ బోర్డు సలహాదారు మల్లారెడ్డి, గ్రామస్తులు దత్తుపటేల్, మల్లేశ్, ప్రమోద్ సాయన్న, మహేందర్, బంజ సాయినాథ్, గంగారం పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు



ఇంటింటా జోగులో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని గోదావరి తీరంలో ఎల్లమ్మ ఆలయ వార్షిక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండోరోజైన బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఉత్సవ మూర్తి విగ్రహాలతో ఇంటింటా జోగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బైండ్లోళ్ల డప్పుచప్పుళ్ల నడుమ భక్తులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అమరవేణి శంకర్‌గౌడ్, బుర్ర రాజారాం గౌడ్, దుర్గం వెంకాగౌడ్ తదితరులు ఉన్నారు.

'బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి'

ముధోల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు పాటిల్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అంతకుముందు వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

అమ్మితే రూ.8.. కొంటే రూ.20



ఈ ఫొటోలో కనిపిస్తున్నది లోకేశ్వరం మండలం ధర్మోరకు చెందిన మంద లింగన్న. ఈ రైతు గ్రామంలో యాసంగిలో ఎకరంన్నరలో కర్బూజ పంట సాగు చేశాడు. గతేడాది ఎకరంన్నరలో 20 టన్నుల దిగుబడి రాగా కిలోకు రూ.13 చొప్పున విక్రయించాడు. ఈసారి వాతావరణం ప్రతికూలంగా మారడంతో కేవలం 10 టన్నుల దిగుబడి మాత్రమే వచ్చింది. ఈసారి దళారులకు కిలోకు రూ.8 చొప్పున విక్రయించగా రూ.80 వేలు వచ్చాయి. పెట్టుబడులు రూ.60 వేలు పోనూ రూ.20 వేలు మిగిలాయని రైతు వాపోయాడు.



భాగాపూర్‌లో మల్చింగ్ విధానంలో సాగవుతున్న కర్బూజ

- కర్బూజ రైతులపై దళారుల పెత్తనం
- రైతుకు కిలోకు రూ.5నుంచి రూ.8 చెల్లింపు
- ఏటా నష్టపోతున్న అన్నదాతలు
- మార్కెట్ సౌకర్యం కల్పించాలని వేడుకోలు

లోకేశ్వరం: వేసవిలో కమ్మని రుచితోపాటు ఆరోగ్యాన్నిచ్చేది కర్బూజ. కానీ ఈ పంటను సాగు చేసే రైతులు మాత్రం తక్కువ ధరకు అమ్ముకుంటూ నష్టాలనే మూటగట్టుకుంటున్నారు. దిగుబడి పెరిగినప్పుడు విపణిలో ధర తగ్గడం..సాగు తగ్గినప్పుడు ధర పెరగడం మామూలైంది. ప్రస్తుతం మార్కెట్‌లో తక్కువ ధర పలుకుతుండటంతో కూలీలు, రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కావని పండ్లను కోయకుండా చేన్లలోనే వదిలేస్తున్నారు. కొందరు రైతులు ధైర్యం చేసి మార్కెట్‌కు పంటను తరలిస్తే.. దళారులు తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. అదే పంటను చిరువ్యాపారులకు మళ్లీ ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు.

జిల్లాలో 826 ఎకరాల్లో సాగు..

రైతు చేతులో పంట ఉన్నప్పుడు ధర ఉండదు. పంట లేనప్పుడు ధర ఉంటుంది. జిల్లాలో ఈ పరిస్థితి ఈ ఒక్కరైతుదే కాదు జిల్లాలోని రైతులందరిదీ ఇలాగే ఉంది. యాసంగిలో లోకేశ్వరం, తానూరు, కుబీర్, సారంగపూర్, మామడ, లక్ష్మణచాంద, భైంసా, ముధోల్ తదితర మండలాల్లో 826 ఎకరాల్లో కర్బూజ సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కర్బూజ పంటకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతుకు దక్కాల్సిన లాభాలకు దళారులు గండికొడుతున్నారు. భైంసా, నిజామాబాద్ వ్యాపారులు హోల్‌సేల్‌గా పంటను కొని అవసరం ఉన్న ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం భైంసా, నిజామాబాద్,



లోకేశ్వరంలో దళారులకు విక్రయిస్తున్న రైతు

నిర్మల్ పట్టణాల్లోని మార్కెట్‌లో కర్బూజ కిలోకు రూ.15 నుంచి రూ.20 ధర పలుకుతుంది. కానీ దళారులు కిలోకు రూ.5 నుంచి రూ.8 వరకే రైతులకు చెల్లిస్తున్నారు. మార్కెటింగ్ సౌకర్యం లేక దళారులను ఆశ్రయించక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వమే కొనాలి..

ప్రభుత్వమే రైతుల నుంచి నేరుగా పంటను కొనుగోలు చేస్తే వారికి మేలు జరుగుతుంది. రవాణా భారం తగ్గడంతోపాటు గిట్టుబాటు ధర వస్తుందని ఆయా గ్రామాల్లోనిర రైతులు పేర్కొంటున్నారు.

విపణిలో పరిస్థితి ఇలా..

ప్రస్తుతం మార్కెట్(విపణి)కి కర్బూజ పంట ఎక్కువ వస్తున్నందున ధర తగ్గుతోంది. బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ.20 పలుకుతోంది. జిల్లాలోని ఆయా మండలాల నుంచి కొనుగోలు చేసిన పంటను జిల్లా కేంద్రంతోపాటు హైదరాబాద్, నిజామాబాద్, నాందేడ్ జిల్లాలకు వ్యాపారులు తరలిస్తుంటారు. రైతులకు మాత్రం కిలోకు రూ.5 నుంచి రూ.8 వరకే చెల్లిస్తున్నారు. నేరుగా సంతలు, మార్కెట్లలో ప్రజలకు మాత్రం కిలోకు రూ.20 నుంచి రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు. దళారులు తమ కమీషన్ పెంచుకుంటూ రైతులను కష్టాలపాలు చేస్తున్నారు. మార్కెట్‌కు తెచ్చిన పంటకు ధర లేకుంటే.. తిరిగి ఇళ్లకు తీసుకునేందుకు రవాణా చార్జీలు భరించలేక కొందరు రైతులు అక్కడే వదిలేయడమో లేక పారబోయడమో చేస్తున్నారు.

నిల్వకు వీలు లేక విక్రయించాం



చేతికొచ్చిన కర్బూజ పంటను నిల్వ చేసుకునేందుకు వీలు లేకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరకు విక్రయించాం. కిలోకు రూ.8 చొప్పున ధర లభించింది. ఎకరాకు రూ.లక్ష తీసుకున్నా రైతులకు మాత్రం లాభం నామమాత్రంగానే దక్కుతుంది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా.. రైతులకు మాత్రం లాభం పరిమితమే.

– కృష్ణారెడ్డి, రైతు, భాగాపూర్

ఈ సేవా కేంద్రం ప్రారంభం

నిర్మల్‌టౌన్: జిల్లా న్యాయస్థానంలో ఏర్పాటు చేసిన ఈ సేవా కేంద్రాన్ని బుధవారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ వర్చువల్ విధానంలో హైదరాబాద్ నుంచి ప్రారంభించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ తదితరులు ఉన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

కుంటాల: రైతుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం పేర్కొన్నారు. బుధవారం కుంటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో నిర్వహించిన పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. దీర్ఘకాలిక రుణాలు వసూలు చేసి.. స్వల్పకాలిక రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. రుణాలు పొందిన సభ్యులకు రూ.రెండు లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, సీఈవో నాగభూషణం, డైరెక్టర్లు గోనె గజ్జారాం, ప్రణయ్‌రావు, శివరాం, పాండు సిబ్బంది శ్రీనివాసరెడ్డి, బోజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'పేద కుటుంబానికి అండగా ఉంటాం'

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ ఎస్సీ కాలనీలో నిరుపేద కుటుంబం దీనావస్థలో ఉన్న విషయమై ఈనెల 26న సాక్షిలో 'ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు' శీర్షికన ప్రచురితమైన కథనానికి మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు స్పందించారు. బుధవారం వారు ఉన్న చోటకు వెళ్లి బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని దేవేందర్‌రెడ్డి ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న వరుణ్‌కు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని భరోసానిచ్చారు. పేద కుటుంబానికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

తానూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని హరిభక్త పారాయణం దామోదర్ మహారాజ్ అన్నారు. బుధవారం మండలంలోని మొగ్గి గ్రామంలో జ్ఞానేశ్వరి పారాయణం పల్లకిసేవ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విఠలేశ్వర ఆలయం ప్రాంగణంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ పారాయణం బుధవారం ముగిసింది. ఈసందర్భంగా జ్ఞానేశ్వరి పారాయణం పల్లకిసేవ శోభాయాత్ర ర్యాలీ నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మహారాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భగవంతుడి నామస్మరణలో నిమగ్నం కావాలన్నారు. చెడు వ్యసనాలకు దూరం ఉంటూ సన్మార్గంలో పయనించాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్, జ్ఞానేశ్వర్, వార్‌కరి భక్తులు తదితరులు ఉన్నారు.

నేడు సప్తాహం ముగింపు

మొగ్గి గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం గురువారం ముగియనున్నట్లు సప్తాహం కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం కాళ్యకీర్తన అనంతరం భక్తులకు గ్రామకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్‌కరి భక్తులు తరలిరావాలని కోరారు.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

వంద రోజులు పని కల్పించాలి

- డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: ఉపాధిహామీ పథకం కింద ఒక్కో కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 400 మంది కూలీలకు వంద రోజుల పని కల్పిస్తూ సకాలంలో డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో జయదేవ్, ఆయా మండలాల ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

పంటలకు సాగునీరు అందించాలి

ఖానాపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా గ్రామాల రైతుల సమస్యలను తెలుసుకున్నారు. డీ27, డీ28 కాలువల పరిధిలో నీరు రాక రైతుల పంటలు ఎండిపోతున్నాయని.. ఇతర చోట్ల నీటి ఎద్దడి సమస్యలున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ముమ్మరంగా వాహనాల తనిఖీ

నిర్మల్: సారంగపూర్ మండలంలోని మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన సిర్పెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్ బుధవారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనం తనిఖీ చేస్తూ వీడియో తీయాలని సీఐ సూచించారు. జిల్లాలోకి మద్యం, డబ్బు ప్రవేశించకుండా జాగ్రత్తలు పాటిస్తూ తనిఖీలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. చెక్‌పోస్టు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ముధోల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వద్ద బుధవారం ఎస్సై సాయికిరణ్ వాహనాలను తనిఖీ మద్యం, డబ్బు రవాణాతోపాటు అసంఘటిత కార్యక్రమాలను గుర్తించేందుకు వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకుంటూ నిబంధనలు పాటించాలని సూచించారు.



సిర్పెల్లిలో తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై

ఎనిమిది మందికి రిమాండ్

ఖానాపూర్: కుంటాల మండలం కల్లూర్ గో శాల నుంచి కాళేశ్వరం సమీపంలోని అన్నారం గోశాలకు పశువులను తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని ఖానాపూర్ మండలం పాతఎల్లాపూర్‌లో అడ్డుకొని డబ్బుల కోసం డ్రైవర్‌పై దాడి చేసిన ఎనిమిది మందికి బుధవారం ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ రిమాండ్ విధించారని ఎస్సై లింబాద్రి తెలిపారు. నిందితులపై కేసు నమోదవడంతో కోర్టులో హాజరుపరిచి జైలుశిక్ష విధించిన వారిని నిర్మల్‌కు తరలించామని అన్నారు. ఈ కేసులో మరికొందరు పరారీలో ఉన్నారని.. వారిని కూడా పట్టుకుంటామని పేర్కొన్నారు.

'లంబాడాలకు ఎంపీ టికెట్ ఇవ్వాలి'

నిర్మల్: ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 35లక్షల వరకు జనాభా ఉన్న లంబాడాలకు రాజకీయ పార్టీలు ఎంపీ టికెట్ ఇవ్వాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో బుధవారం జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల్లో జనాభాపరంగా అధికశాతం ఉన్న బంజారాలను విస్మరించడం సరికాదన్నారు. ఏటా తమ జనాభా పెరుగుతోందని.. ఈప్రాతిపదికన తమకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల ఒకట్రెండు తేదీల్లో బంజారాల మహాసభ నిర్వహిస్తామన్నారు. పార్టీలు టికెట్ ఇవ్వకుంటే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు జేఏసీ నాయకులు జాదవ్ అశోక్‌నాయక్, రాథోడ్ రాజేందర్ నాయక్, హపావత్ రాజేందర్, విజయ్ జాదవ్, రామారావు, గజేందర్, రోహిదాస్, బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

కుంటాల: వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు ఎఫ్ఎస్ఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మెదన్‌పూర్ అటవీ ప్రాంత పరిసరాల్లో వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన సాసర్‌రింగ్‌లలో నీళ్లు నింపారు. అటవీ ప్రాంతంలో మూగజీవాలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. అడవిలో నిప్పు పెట్టకుండా ట్రాక్టర్‌తో గడ్డిని చదును చేయించామని పేర్కొన్నారు. వారి వెంట ఎఫ్‌బీఓ హరిలత, సిబ్బంది అలాంఖాన్ తదితరులు ఉన్నారు.



సాసర్‌రింగ్‌లో నీళ్లు నింపుతున్న అధికారులు

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

తానూరు: నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో మోహన్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని బెంబర, బోరిగాం గ్రామాల్లో పర్యటించి పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. నర్సరీల్లో, పల్లె ప్రకృతివనంలో మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని వనసంరక్షకులకు సూచించారు. జాబ్‌కార్డులు కలిగిన కూలీలు విధిగా ఉపాధిహామీ పనులకు వెళ్లాలని పేర్కొన్నారు. వారి వెంట ఈజీఎస్ ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు, వన సంరక్షకులు తదితరులు ఉన్నారు.

మస్కాపూర్‌లో ఇఫ్తార్ విందు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ మదీన మజీద్‌లో అదే గ్రామానికి చెందిన అడిదెల మహిపాల్ ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఖలీల్, మాజిద్, ముజీబ్, సాజిద్, కృష్ణ, ఇమ్రాన్, మెహరాజ్ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్కీ డ్రా పేరిట మోసం చేసిన వ్యక్తులకు జైలు

నిర్మల్‌టౌన్: లక్కీ డ్రా పేరిట ప్రజలను మోసం చేసిన వ్యక్తులకు రెండేళ్ల సాధారణ జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.3500 చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయ అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ షాబ్ ఘాట్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న లక్కీ డ్రాపై సారంగాపూర్ ఎస్సై నర్సింహారెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. అక్కడ ఆదిలాబాద్‌కు చెందిన గోల్కొండ ఆశిష్, సూది నరేశ్, బోథ్ మండలానికి చెందిన సింగారి క్రాంతి, గడ్డం అజయ్‌కుమార్, భువనగిరి కార్తీక్ డ్రా నిర్వహిస్తున్నారు. పోలీసులను చూసి కొందరు పారిపోగా గోల్కొండ ఆశిష్ పట్టుబడ్డారు. అక్కడ స్వాధీనం చేసుకున్న రూ.1.40 లక్షలను సీజ్ చేశారు. ఒకరి నుంచి నెలకు రూ.1150 వసూలు చేస్తున్నామని ఆశిష్ తెలిపారు. ఎస్సై సుమోటోగా కేసు నమోదు చేసుకొని మిగతా వారిని అరెస్టు చేశారు. చార్జ్ షీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు 20 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయగా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజేశ్‌కుమార్ బుధవారం తీర్పునిచ్చారు.

అటెన్షన్ ప్లీజ్.. మూగ రోదన.. అరణ్య వేదన



ఖానాపూర్: పట్టణంలో రోడ్లపై సంచరిస్తున్న మూగజీవాల రోదన.. అరణ్య వేదనగా మారింది. కొన్ని పశువులు రోడ్డు ప్రమాదాల్లో, మరికొన్ని జీవాలు ప్లాస్టిక్ వ్యర్థాలు తిని మృత్యువాత పడుతున్నాయి. రోడ్లపై తిరుగుతున్న పశువులను తరలిస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నా.. ఎక్కడా అమలు చేయడం లేదని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మనోహర్, మున్సిపల్ కమిషనర్, ఫోన్ : 78421 50545

బాధిత కుటుంబానికి సాయం



చెక్కు అందిస్తున్న పీఆర్టీయూ నేతలు

భైంసాటౌన్: బాసర మండలం బిద్రెల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి.సాయినాథ్ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులకు పీఆర్టీయూ తరపున ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు టి.నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారి కుటుంబానికి భవిష్యత్‌లో సంఘం అండగా ఉంటుందని పేర్కొన్నారు. పీఆర్టీయూ సంఘం మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పలువురు సభ్యులు ఉన్నారు.